# రహస్యము

పురాణం కుమారరాఘవశాస్త్రిగారు బి. యె.

౧

ఒక స్త్రీయొక్క నిరాడంబరజీవితమిది విశ్వమానవజీవితము నిరూపించే గొలుసుకు ఒకచిన్నకొక్కె మీ పేదరాలిచరిత్ర. ఆమె హృదయపుటీధ్వను లెప్పుడూ స్వర్గమార్గాన్నే అనుసరించేవి

హిందూస్త్రీకి ప్రపంచము చాల సంకుచితమైనది. కాని యీచిన్నివలయములోనే సంచరించుతూ, దానికీవన్నె తెచ్చే ఒకహృదయోత్కంఠ, ఒకఆశయము, ఒకపరమావధి ఆమెకు లేకపోలేదు ప్రేమమయ మామె జీవితమంతా. భయవిహ్వలచిత్తముతో భర్తను కలసినరోజుమొదలు మృత్యుదేవి తన్నుకోరేవరకూ ఈప్రేమనిధివున్నదామె హృదయమునింపుటకు ఆమెస్వరూపమే ప్రేమ. ఈప్రేమే అంతమొత్తంతో మళ్ళీ తనకు తిరిగివచ్చినప్పుడు భగవంతుడే ఆమె సౌఖ్యముయొక్క అంతు తెలిసికోగలుగుతాడు. కాని వేరువిధముగా పరిణమిస్తే స్త్రీకి ప్రపంచమే శూన్యము. జీవితము తనకు ప్రసాదించే ఆఅమూల్యవస్తువూపోయింది. దానికి తులతూగేది మరేమీ ఆమెకు కనుపించదు.

నేనొక హిందూస్త్రీని. ఒంటరిగా దుఃఖంతో గడపేదాన్ని కాలం. మాఅత్తగారు నన్ను చాలాప్రేమించేదే. నేను సుఖంగా వుండటమే ఆమెపకోద్దేశము. నేను గొడ్డురాలనూకాను. దేవతలు నాకొక చక్కని తేజోవంతుడగు కుఱ్ఱవాడిని ప్రసాదించారు. కాని నాదేహములో ఆత్మనశించింది. నాభర్త ఎప్పుడూ నన్ను నిరసించి నాకు విముఖుడై తిరిగేవారు తన్మూలమైనవ్యథ నాహృదయమూక్రమించుకొని అనంతంగా కనుపించేది. అత్తగారు నాదుఃఖమంతా చూచి నాపక్షమువహించి, తరుచు వారితో పోట్లాడుతూ, తిట్టుతూ, నాపై జాలిగలిగేలాగు వారిని ఎలాగైనా త్రిప్ప ప్రయత్నించేది. కాని, అయ్యో, మార్పుకనిపించలేదు. మరింత చెడుగా పరిణమించినదికూడా. తల్లిగారి కోపవాక్యాలు వారినిఇంటినుండి తఱిమివేసేవి. ఒక్కొక్కప్పుడు కొన్నిరోజులవరకూ వారిని నేను చూచేదాన్ని కాను. అప్పుడునాకు జీవితము నిరంజనము—నిరాశపడేదాన్ని. వారికి నేనంటే కిట్టకపోవచ్చు. కాని ఆమూర్తి నాకన్నులముందుంటే చాలు నాహృదయం శాంతిపడుతుంది. అబ్బ! వారు నాకు కనుపించనప్పుడు నేననుభవించే గుండెయారాటము పిచ్చిదాన్నిఔతున్నానా అనిపించేది. ఆయనచేతుల్లో నాకెట్టిఆదరణజరిగినా ఆముఖము చూస్తుంటే నాకుచాలు.—ఇదంతా వివేకరహితమైన యుద్రేకమనేవాళ్ళు కొందరు!

మా అత్తగారు నా యెడలచూపేజాలికి కృతజ్ఞురాలనుకాదు. వారిపై ఆమె కోపించకపోవడమే నేనుకోరింది.

ఒకపదిహేనురోజులు వారింటిచాయరానేలేదు. వారినిచాలామంది వెతకబోయారు. కాని వారందరూ తెచ్చిన దుఃఖవార్త

మాత్రం ఒక్కటే. "వారక్కడ లేరు. ఆయిల్లుబీగము వేయబడియున్నది."

తల్లిగారిఆరాటము హద్దుమీరినది ఇక నేనోః నిద్రాహారములెరుగను. ఆదుఃఖంలో నాబిడ్డను నాహృదయానికదుముకొని భగవంతుని ప్రార్థించాను. ఒకమానవహృదయము భరించలేనంతవున్నది నాదుఃఖము. కాని, దేవతలున్నారు మర్త్యప్రపంచము మీాద ఒకకన్నుంచి జాలితో, ఏడ్చేవాళ్ళను ఓదార్చకపోరు.

సూర్యోదయముకాలేదింకా. రాత్రి అంతా ఏడ్చిఏడ్చి అప్పుడేనిద్రపట్టింది. ఒక కల కన్నాను విచిత్రంగానూ, మహాశ్చర్యకరంగానూవున్నది. ఆకాశమంతా ఒకస్వర్గీయమగు వెలుగుచే దీప్తిమంతమైంది. ఆవెలుగులో ఒకస్త్రీ. ఆమె తనచేతులూపుచున్నది. ఒకతమ్మిపూవు నాచాయగిరాటువేయబడినది. "తీసికో అమ్మా! దాన్ని. నీజుట్టులో ధరించుకో, నీప్రభువు నిన్ను ప్రేమిస్తాను" అన్నదామె పువ్వుతీసికొని మేలుకున్నాను. ఇంకా తెల్లవారలేదు ఐనాతొందరగాలేచి అత్తగారివద్దకు పరుగెత్తి అంతాచెప్పేను.

"పువ్వుఉన్నదా నీదగ్గిర?"

"లేదు. కలలోచూచానాపువ్వును."

"అమ్మా!" ఆమెచెప్పింది. "కాళికాగుడికి పో ఇప్పుడే పూజాపుష్పమొకటి తెచ్చుకొనిధరించు. తొందరగా! ఆలస్యము కూడదు."

౨

మేము నివసించేది భవానీపురంలో. కాళికాగుడి మాయింటికంత దూరంలోలేదు. ఈవరకుపలుసార్లు నేనచటికిపోయి దేవికి నాదుఃఖతాడితహృదయాన్ని వ్యక్తపరచాను. కాని ఈమారు ఆనెత్తురుకాల్వలుదాటి గర్భగుడిలో ప్రవేశించేసరికి నాశరీరము కంపించినది. తల తిరిగిపోయింది

"ఎంతభయంకరంగావున్న దీకాళీస్వరూపం"అంటున్నాడు ఒకనాస్తికుడు. భక్తులకు మాత్ర మాతల్లి సౌందర్యమూర్తియని అతనికితెలియదు. ఇతరులకంటెకేలాగు కనుపించినను, తల్లి కుమారునకుమాత్రము ప్రేమమయి అట్లే కాళీమూర్తిలో గర్భీభూతమైన అపారప్రేమ భక్తుడే చూడగలుగుతాడు. నాకుమాత్ర మీారోజున ఆమెభయంకరత్వమే గోచరించినది పరులై అక్కడ పారుచున్న రక్తము నాచర్మచక్షువులకు కనుపించి దేవి క్రూరురాలని అనుకున్నాను. కాని నిన్నరాత్రి కలలో కనుపించిన ఆస్వర్గీయసౌందర్యము మాత్రము నాహృదయాంకితమైయున్నది. ఈవ్యత్యాసమువలన దేవి మరింతవికృతముగ కనుపించుతున్నదినాకు —నాలుక బయటకు చాచివున్నది ఒకచేతిలోఖడ్గము, మరొక చేతిలో రక్తమయమైన మానవశీర్షము కనుపించుతున్నవి. ఐనను తక్కిన రెండుహస్తములతోదేవి భక్తజనులను ఆశీర్వదించుతుందని ఎరుగుదును జీవితములో పలుమార్లామె దయారసము రుచిమెరిగియున్నాను. కాని ఈరోజు నాకు మనసుకుదురలేదు ఆమె బహిస్వరూపమే నాకు కనుపించుతున్నది. నిన్నటి రేయి నాకు కనుపించిన ఆసౌందర్యమూర్తి యొక్క ప్రతిబింబమాయిది? విగ్రహము చూచి భయముతో వెనుకకడుగువేశాను.

కాని మళ్ళీ నిన్న నానిద్రలోని యారూపము హృదయవీథిలోపరుగెత్తింది. క్రొత్తయాస మొలకెత్తింది. ఈపరస్పరభిన్నభావములలో మునిగి యాగర్భగుడితలుపుదగ్గిర నేలకొరిగి పడిపోయినాను బలహీనస్నై.

అప్పుడు నాకు సహాయురాలుగావచ్చిన పనికత్తె ఉమ తత్తరపడి కేకలువేసింది. నన్ను బాగాఎఱిగియున్న అర్చకుడు లోనుంచి పవిత్రజలముతెచ్చి నాపైచిలికెను. గుంపులోనుంచి నన్నానలకుగొంపోమని ఉమకుచెప్పుతూవున్న ఆయన మాటలు నాకు అస్పష్టముగావినుపించినై. కొంతదూరములోవున్న ఒకవృక్షముచూపించి "ఈమె నక్కడకుతీసుకపో. విశ్రాంతితీసుకోగలదు" అని చెప్పేడాయన.

వృక్షచ్ఛాయకుకొనిపోబడ్డాను. అక్కడ తెలిసీతెలియని స్థితిలోపడిఉన్నాను. అక్కడ మరొకస్త్రీకూడావున్నది.

ఆమె పరిచయముసంపాదించుటకు ఎంత కాలమోపట్టలేదుఉమకు. తనహృదయము విప్పి ఆమెకు నాకథంతా కాలహరణము కాకుండా చెప్పేసింది.

"నామనస్సు డోలాందోళితమైంది; అమ్మమూర్ఛపోయింది.—ఐతే మీవాస మెక్కడతల్లీ!" అడిగింది ఉమ.

"చాలాదూరము. మీరు నన్నెఱుగరు. మీనివాసమో?" ఇదీ మందస్వరమునవచ్చిన జవాబు.

"మేము భవానీపురంలో కాపురం. గోపాలబాబును మీరెన్నడూ వినియుండలేదా? ఒకప్పుడాయన చాలమంచివాడు. అయ్యో! ఇప్పుడు—" ఉమ నిట్టూర్పువిడిచి ఊహాప్రపంచములో మునిగిపోయింది.

"ఆయన కేమౌతుం దీమె" అని మరల ప్రశ్నించిం దామందస్వరం.

"ఏమౌతుంది! ఆయనభార్య..మరెవరు?" ఉమకు వాగ్ధాటివచ్చింది. "అయ్యో! అదంతాతలస్తే నాహృదయంపగిలిపోతుంది. ఒకతమ్మిపూవు మురికికాలువలో విడువబడింది. అగ్నిసాక్షిగాచేసికొన్న భార్యాస్థానము ఒకకులటచేత ఆక్రమింపబడింది. చూడుమామెవైపు. స్త్రీజాతిలో ఒకరత్నముగా ప్రకాశించడములేదా? ఐతే ఏమి; ఆమెను లక్ష్యముచేయడాయన. ఆమెపాపము ఏమిచేస్తుంది? ఆరోగ్యభంగమయ్యేటంతవరకూ ఏడ్చివేసింది."

ఉమకు ఉద్రేకముమీరిపోయింది. గౌరవహీనమగు కోపవాక్యముల ప్రవాహము గుప్పించేస్తున్నది.

మరలనాకు స్మృతిగలిగినప్పుడావాగుడు కత్తెతో సహేతుకముగా వాదింపమొదలెట్టేను. "ఉమా! ఎందుకాయన్ను గూర్చి చెడుమాటలాడుతావు. సుఖబాహ్యమైన జీవితము నాముఖానవ్రాసివుంటే వారిదా తప్పు?"

ఆ అపరిచితవ్యక్తి నావద్దకు మెల్లగానడచి వచ్చినది. నావైపామె నిశ్చలముగా చూచింది. మృదుమధురమైనజాలి ఉన్నదా కన్నుల్లో.

"పద్మావిలాసినీ!" ఆమెధ్వనికంపించింది. "నీ భర్తచేత తృణీకరింపబడుచున్నావా?. చాలవిచారకరముసుమా!"

"తృణీకరణము మాత్రమేనా?" ఉమ ముగించలేదు తనకథ. "పట్టితృణీకరణమేనా? దానితోముగిసినదా? ఈమె సొమ్ములన్నీ దోచేశాడు. భార్యనుగురించిన ప్రేమాలోచనేమీలేకపోయినా సొమ్ముకు మాత్రం వస్తాడుదగ్గరకు. ఎన్నిమార్లుచెప్పిచెప్పి నోరు పోయిందిమాకు, ఆయనకు సొమ్ములీయకూడదని. సంబంధముతీరిపోయింది. ఇక నాయనకు బంగారమీయడము పాపకృత్యమన్న మాట.—— టక్కులన్నీ నేర్చుకున్నవాడాయన. కొంచెముబుజ్జగించితే ఈమెకు చైతన్యంపోతుందిని బాగాఎరుగు. ఏదోఆపత్తులో వున్నట్లుచెప్పుకుంటాడు. ఇంకేం. ఈపాల మనసుతల్లి తనచేతిలో కీలుబొమ్మౌతుంది. ఈమెనని లాభంలేదు.——ఆనాడు మరికొంత సొమ్ముతీసుకపోయినందుకు తల్లిగారెంత తిట్టివోసినారు. నాటినుంచీ మళ్ళీకనుపించలేదు. సగముపిచ్చియెత్తి యీమె ప్రాణాలు గోలుపోటానికి సంసిద్ధురాలైంది."

ఈవాచాలత నాకు కష్టమనుపించింది. "ఉమా! ఆఘనీ ధోరణి కోపంపుట్టిస్తున్నావు నాకు."

"ఆ అమ్మాయి తప్పులేదు. అటువంటి భర్తను నేనైతే ఎదుటికేరానీయను" అపరిచితవ్యక్తిఅన్నది. "అమ్మా! నమ్మకముండనీ. మరలఅదృష్టము నీమీదచిఱునవ్వుగురిపింప గలదు. నీవంటిదానిఆర్తి దేవతలు చాలకాలముసహించరు."

ఆమెకన్నులు దయాగర్భితములై ప్రకాశించినవి నాచేయిపట్టుకొని యెత్తినదామె అర్ధనిమీలితములైన వామెనేత్రాలు.

"నీవు దేవతలుప్రసాదించిన వరమనుకోక నిన్నుకష్టాలుపెట్టేవానికి దుఃఖమే నిల్చుగాక!" ఆమెవిచారములో కొంచెమాలోచిస్తూనిల్చున్నది.

"అమ్మా! నీజీవితదుఃఖమంతా నాపాలుగానీ; దేవి కాళిక నీప్రార్థనఅంగీకరించును గాక!"

ఇవియే ఆమెకడసారిమాటలు. ఇక వెళ్ళిపోవటానికి లేచింది. ఆమెమూర్తిలోనుంచి దైవసంబంధమైనజ్యోతి ప్రకాశించడము కనుపించిందినాకు. అయితే స్వప్నములో నేనుచూచినస్త్రీ యీమేనా?

## 3

చాలారోజులుగడచిపోయినై. ఒకనాడు మధ్యాహ్నం మేమెన్నడూఎరుగని ఒకస్త్రీ మాయింటికివచ్చింది. తానెవరో మొదటచెప్పకోకుండానే మమ్మల్ని సంబోధించి "ఇవిగో మీసొమ్ములు. ఋణమంతాతీర్చుకున్నాడు బాబు. ఇవి మీకిచ్చేయమన్నారు. ఇవిగో చూచుకోండి,అన్నీసరిగ్గాఉన్నాయోలేదో"

అత్తగారు మూగపడిపోయినారు. ఎన్నడూ సంభ్రమమెరుగని ఉమమాత్రం నాలుకతెరచింది "బాబుమళ్ళీ వెనుకటిస్థితికివచ్చారు. జగన్మాతప్రభావము కాబోలు" సొమ్ములన్నీవచ్చాయని సంతోషంగాచెప్పింది ఉమ.

నామనస్సు సొమ్ములమీదలేదు. అవన్నీ మాఅత్తగారు చూస్తున్నారు నేను మా వారినిగురించి ఆలోచిస్తూకూర్చున్నాను. ఈస్త్రీ ఆయన్ను చివరసారి ఎప్పుడు

చూచిందో. శాంతిఎటుగనినాహృదయం కొట్టుకుంటున్నది.

"బాబుగారు నీకీసొమ్ములన్నీ ఎప్పుడిచ్చారు?" అని అడిగేనుఆస్త్రీని.

"సుమారువారమురోజులక్రింద నాకు పనివుండటముచేత ఆలస్యంగావచ్చాను. ఈసొమ్ములన్నీ నాదగ్గిరేఉన్నవిన్నాళ్లనుంచీ."

"నాకొడుకు ఇంటికెప్పుడువస్తాడో చెప్పలేవా?"—ఇది అత్తగారు ఆతురతతో అడిగినప్రశ్న

"అది నేనెలాగుచెప్పుతానమ్మా? ఇదిగో మీసొమ్ము—మీప్రాణముమీకువచ్చినది." ఈమాటలతో ఆ స్త్రీ వంగి నమస్కరించి తొందరగావెళ్ళిపోయింది.

వారినిగురించి ఇంకాతెలసికోవాలనివుంది నాకు. కాస్సేపు ఆమెనుండుమందామనుకున్నాను. కాని నేనుమాటచెప్పకముందే వెళ్ళిపోయింది

నే నింకా కృశించిపోనవసరములేదు. ఆ నాటిసాయంత్రమే ఆయన—నామనోనాథుడు తిరిగివచ్చారు. మనఃపూర్వక స్వాగతమిచ్చాము. గృహమంతా ఆనందపరవశమైంది భోజనసమయమప్పుడు మాఅత్తగారు మాటలుకలిపింది. "బాబూ! ఆభరణాలన్నీ ఇంటికంపినందుకు చాలాసంతోషించాను. అంతకంటేఎక్కువగా ఆనందిస్తున్నాను భగవంతుడు నీహృదయంలో పరివర్తనతెచ్చి నిన్నింటికితెచ్చినందుకు."

నాభర్త ఆశ్చర్యముతో చూచారామె వైపు ఆమెమాటలు అర్థంకానట్లున్నది.

"ఏంఆభరణాలు? ఏమిటమ్మా! నీవు చెప్పేది?"

"ఆముసలిస్త్రీదగ్గిర ఏనగలు తాకట్టుంచి డబ్బుతెచ్చుకున్నావోఅవి ఈరోజుమధ్యాహ్నమామె తనంతతానేవచ్చి నగలిచ్చిపోయింది. ఋణముతీర్చివేశావనిఆమెచెప్పింది"

ఆశ్చర్యనిమగ్నునివలెకనుపించారాయన. 'అలాగా' అనిమాత్రమే వారన్నది. మనసులోని కలవరముమాత్రము అణచుకోలేకపోయినారు

తరువాత వారు నాయేకాంతగృహమునకు వచ్చి నగలన్నీచూపమన్నారు. తెచ్చి ముందుంచాను ఒక్కొక్కటి జాగ్రత్తగాపరిశీలించారు. ఆయనముఖవైఖరిలో మనోవ్యాకులత కనుపించుచున్నది. నాకేమీతోచకుండావున్నది ఆయనప్రవర్తన నన్ను కలతపెట్టినది బహుశః ఈఆభరణాలు తిరిగీఉపయోగించుకోతలచారేమోననుకొని అవన్నీ వారికర్పించి 'తీసికొండ' న్నాను

"వద్దు" ఆయన కంఠముకంపించింది

ఇంటికివచ్చినకొద్దిసేపటికే మళ్ళీ వెళ్లిపోవడము మామూలాచారమే. దుఃఖసూచకమైన వారిముఖాకృతి నామనోవీథి విడిచిపోలేదు. ప్రక్కమీద అశ్రద్ధగాపడుకున్నా కుఱ్ఱవాణ్ణి చేతుల్లోపట్టుకుని దేవతలు దయామయులు నాకు వెంటనే నిద్రపట్టింది ఈవరకు చాలరోజులనుంచీ యెరుగనిసుఖసుప్తి అనుభవించాను మరుచటిఉదయం నాచిన్నికుమారుని జిలిబిలికేకలు నన్ను నిద్రలేపినవి 'పపా! పపా!' అంటూ సంతోషంతో చేతులూ, కాళ్ళూ ఆడిస్తున్నాడు చిన్నవాడు.

యదార్థము కాని ఒకమనోదృశ్యమా

ఇది! నిజముగా స్వప్నప్రపంచములోనే ఉన్నానా? కండ్లు బాగా తుడిచికొని చూచాను. నాఆత్మనాథుడే నిలబడిఉన్నారు నాముందు. వారిచూపులు నామీదే ఉన్నవి—నామీదా, వారికుమారునిమీదా. కాని వారిముఖము వెలవెలబారి దుఃఖతాడితమువలెఉన్నది కొంతహృదయమథనము కూడా వ్యక్తమౌతున్నది.

"మీరేనా?" అన్నాను నాకన్నులు నేను నమ్మలేనిస్థితిలో. "మీరేమోబాధగా వున్నారు దేనికి? చాల పాలిపోయారు!"

వారుమాట్లాడలేదు బిడ్డనెత్తుకుని హృదయానికదిమికొన్నారు కన్నీళ్ళు చెంపలవెంబడి స్రవించినై. ఇటివంటిస్థితిలో వారిని నేనీవర కెన్నడూచూడలేదు.

"మీదుఃఖమంతా నన్ను ముంచుకోనీయండి. వెనుకటిలాగా మీరు సుఖంగా వుండటమే కోరుతానునేను. అందుకు నాజీవితమచ్చుకోవలసివచ్చినాసరే" నన్నాయన హృదయముదగ్గరకు లాగికొన్నారు "క్షమించగలిగితే నన్నుక్షమించు" ఆమాట లిప్పటికీ నాచెవిలో మ్రోగుతూఉంటవి, ఆకంఠము అపరిచితముగానూ, దుర్బలముగానూఉండి.

ఆతరువాతి నిమిషములసంగతి నే నెఱుగను. నాజీవితంలో అప్పుడు కలిగినమార్పు నాయింద్రియాలను కప్పేసింది. వారిపాదాల మీద మూర్ఛపోయాను. ఇంతకన్నామరే మీమెరుగను ఎవరో, కొద్దిమంది మనుష్య వ్యక్తులకుమాత్రమే అనుభవనీయమైన సుఖ సముద్రంలో తేలిపోతున్నట్లనిపించిందినాకు. ఎప్పుడో, ఏనిముసానో దేవతలు తమ స్వర్గసౌధద్వారాలు తెరచి ఆనందకిరణ మొకటి ప్రసాదిస్తారుటమానవులకు. అలాంటిస్వర్గీయజ్యోతిలో కృతస్నాతనౌటకు నాకు ప్రసాదింపబడిన వానాల్గునిముషాలు.

నాభర్త ఇప్పుడు పూర్వమువలెకాదు. ఇప్పుడాయనకిల్లు రుచించకపోవడములేదు. ఆయనజీవితశేషము నాకూ, ఆయనకుమారుడికీ చెందియున్నది. కాని నాకు మాత్ర మారహస్య మింతవరకూ గోచరించలేదు. తద్విషయములో నాభర్తగారికెప్పుడూ మూకీభావమే. దాన్నిగుఱించిన ప్రస్తావనతేనే లేదు. ఒక్కసారిమాత్రము నేనే అడిగి చూచాను. జరిగిపోయినదాన్ని జ్ఞాపకము తెచ్చుకొనడము తనకిష్టములేదనిచెప్పేరు. నామనస్సుకుమాత్రము కలతగానేవున్నది. తరచు ఆలోచించుకుంటాను దాన్నిగుఱించి. నేనాలోచించినకొద్దీ అదిఅభేద్యమౌతున్నది. పాఠకులలో ఒక్కరైనా చెప్పలేకపోతారా ఈరహస్యము.

# సరస్వతికి

వక్ష్లమాని అప్పారావుగారు

నామధురార్తితోడ భువనమ్ములమ్రోగు సుధావిలాప, మా
శ్యామిహికాశ్రుబిందుతతిచాన్పున, నూత్నకళాప్రపంచ స్వ
ర్గామృతకావ్యమందు నొకయంకముగా నెపుడుండుకోసమై,
కోమలి కోరుచుండె దనకుంరితమూ భవదీయసత్కృపన్!